www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

గాలివాన బీభత్సం

విరిగిన చెట్లు - నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి బోరున గాలి వీయడంతో పాటు జోరుగా వర్షం కురిసింది. ఈ సందర్భంగా పీలేరు పట్టణంలోని రైల్వే గేటు సమీపం ఓ చెట్టు, నాగిరెడ్డి కాలనీ మరో చెట్టు విరిగిపడ్డాయి. పట్టణంలోని పాత బస్టాండ్ వెనుక టక్కే ప్రాంతంలో ఇంకో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడ్డంతో విద్యుత్ స్తంభం కుప్పకూలింది. ఫలితంగా సుమారు రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పట్టణ విద్యుత్ శాఖ ఎఇ ఖదీర్ ఇలాహి సంఘటనా స్థలానికి చేరుకుని, సిబ్బందితో కలిసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం

నేలకొరిగిన విద్యుత్ స్తంభం పరిశీలిస్తున్న అధికారులు

కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

డ్వామా పీడీ వెంకటరత్నం

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు అందరికి అందు బాటులో ఉండి వారందరికీ ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో కూలీలు ఎంతమంది ఉన్నారో, జాబు కార్డులు ఎన్ని ఉన్నాయో, ఎక్కడ పనులు నిర్వహిస్తున్నారో, సిబ్బంది వివరాలు, మౌనిక వసతులు, పనిముట్లు , పెండింగ్ బిల్లులు ఎన్ని ఉన్నాయో ప్రజాశక్తి కి ఇచ్చిన ముఖా ముఖి లో ఆయన వివరించారు.

ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా కార్యాలయాలను వివరాలు తెలపండి ?

జిల్లా నీటి యాజమాన్య సంస్థ జిల్లా కేంద్రం రాయచోటిలో ఉంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, క్లస్టర్ (ఎపిడి), వారి కార్యాలయాలు, మండల అభివృద్ధి అధికారి వారి కార్యాలయాలున్నాయి.

గత ఏడాది పని దినాలు, వేతనాల చెల్లింపు వివరాలు తెలపండి ?

జిల్లా వ్యాప్తంగా గత ఏడాదిలో 88,12,049 రోజులు పని దినాలు కల్పించాం. గత ఏడాదిలో వేతనాలు చెల్లింపులు రూ . 22858.59 లక్షలలో వేతనాలు చెల్లించాం.

జిల్లా వ్యాప్తంగా జాబ్ కార్డుల సంఖ్య, పని దినాల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా జాబ్కార్డులు 2,49,221 జాబు కార్డులున్నాయి. 88,12,049 రోజులు పని దినాలు కల్పించాం.

ఉపాది హామీ పని ప్రదేశంలో కూలీలకు వసతులు, పనిముట్లు కల్పిస్తున్నారా?

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు వసతుల కల్పించిన పనిముట్లు అందజేశాం.

కూలీలకు సకాలంలో బిల్లులు రావడం లేదని విమర్శలు ఉన్నాయి? ఎంత మేర బకాయిలున్నాయి?

జిల్లాలో ఉపాధి హామీ పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్లో ఉన్నాయిన్నమాట వాస్తవమే. 2025 సంవత్సరం జనవరి 15 నాటి నుండి దాదాపు రూ. 37.23 కోట్ల వేతనాలు బకాయిలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. ఇవి త్వరలో చెల్లిస్తామని సిఆర్డి వారు తెలుపుతున్నారు. త్వరలోనే కూలీలకు వారి అకౌంట్లలో జమచేస్తాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

లక్కిరెడ్డిపల్లి క్లస్టర్ స్థాయి (ఎపిడి) ఖాళీ గా ఉంది. ఎఫ్ఎం, డివిఒ, అడ్మిన్ ఆఫీసర్, యాజమాన్య సంస్థ, అన్నమయ్య జిల్లాలో ఖాళీలున్నాయి. మిగతా సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నాం.

కూలీలకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలను కుంటున్నారా?

జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఉపాధి కూలీలందరూ కొలత ప్రకారం దినసరి వేతనం రూ. 300 వచ్చేటట్లు పని చేయాలి. వేసవి అధిక వేడి కారణంగా పని గంటలు ఉదయం 6 గంటల నుండి 11 గంటల లోపల ఉండేలా చూసుకోవాలి. పని ప్రదేశానికి వెళ్లే సమయంలో కనీసం 3 లీటర్ల నీటిని తీసుకెళ్లాలి.

వృద్ధుడికి అండగా ఉంటాం



శంకర్ రెడ్డి కుమారుడు, కుమార్తెకు కౌన్సెలింగ్ ఇస్తున్న మునిగోపాలకృష్ణ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

వృద్ధుడు శంకర్ రెడ్డికి అండగా ఉంటామని ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ తెలిపారు. బి.కొత్తకోట మండలం ఆంజినేయపురానికి చెందిన సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు శంకరరెడ్డిని ఆయన కుమారుడు సాఫ్ట్వేర్ ఇంజినీర్ బాలచంద్రారెడ్డి దాడిచేశారు. దీంతో మదనపల్లె సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈనెల18న పోలీస్ సర్వీసెస్కు ఫిర్యాదు చేశారు. స్పందించిన బి.కొత్తకోట పోలీసులు శంకరరెడ్డి ఇంటికి వెళ్లి బాధితుడిని మదనపల్లెలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు ఆదివారం సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.ముని గోపాలకృష్ణ, కృష్ణకుమార్ ఆసుపత్రికి వెళ్లి శంకర్రెడ్డిని పరామర్శించారు. డాక్టరును సంప్రదించి ఆయన ఆరోగ్యపరిస్థితిపైన ఆరా తీశారు. బాధితుడి కుటుంబ సభ్యులను సంప్రదించారు. ఈ సందర్భంగా బాలచంద్రా రెడ్డిని, కుమార్తె విజయను ఆస్పత్రికి పిలిపించి కౌన్సెలింగ్ యిచ్చారు. 2007 తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం ప్రకారం 70 ఏళ్ల పైబడిన శంకర్ రెడ్డికి కుమారుడు బాలచంద్రారెడ్డి జీవనం, వైద్య ఖర్చులకు ప్రతి నెలా రూ.10 వేలు ఇవ్వాల్సిందిగా సూచించి ఒప్పించారు.

విన్నర్, రన్నర్ జట్లతో నిర్వాహకులు ఎలిచెలమల షామీర్

రేగళ్లు క్రికెట్ టోర్నీ విజేత గణేష్ జట్టు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండలం, రేగళ్ళులో జరిగిన క్రికెట్ టోర్నీలో మాన్స్టార్ గణేష్ జట్టు విజేతగా నిలిచింది. రేగళ్లలో 3 రోజులుగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్ - 4 క్రికెట్ టోర్నీలో నాలుగు జట్లు పోటీపడ్డాయి. ఫైనల్స్లో మాన్స్టార్ గణేష్, లియాకత్ జట్లు పోటీపడ్డాయి. చివరికి గణేష్ జట్టు 2 వికెట్ల తేడాతో లియాకత్ జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న లియాకత్ జట్టు 7 ఓవర్లకి 51 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలో దిగి బ్యాటింగ్ చేసిన గణేష్ జట్టు 6.5 ఓవర్లలో 53 పరుగులు తీసి 2 వికెట్ల తేడాతో విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకి మొదటి బహుమతి రూ.10,116, రెండవ బహుమతి రూ.7,116 నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను టోర్నీ నిర్వాహకులు ఎలిచెలమల షామీర్, లియాకత్ అందించారు. అలాగే బెస్ట్ బ్యాట్స్మెన్గా భాను, బెస్ట్ బౌలరుగా బి. భాను ట్రోఫీలు అందుకున్నారు. ఈ టోర్నీకి అంపైర్లుగా షమీవుల్లా, విజయ శేఖర్ రెడ్డి, మణికుమార్ వ్యవహరించారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి- మదనపల్లె

రక్తదానం చేయడం గొప్పదని వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా పేర్కొన్నారు. మిట్స్ కళాశాల యాజమాన్యం, ఎస్వీఎస్ ఛారిటబుల్ ట్రస్ట్, మదనపల్లె ఆధ్వర్యంలో ఆదివారం రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల మరొకరి ప్రాణాన్ని కాపాడిన వారవుతారన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారు, ఆపరేషన్కు లోనయ్యే వారు, గర్భిణులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడే వారికి రక్తదానం ఎంతో అవసరమని చెప్పారు. రక్తదాత ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. పాత రక్తకణాలు తొలగిపోయి, శరీరంలో కొత్త కణాల ఉత్పత్తి అవుతుందని, ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి రక్తదానం చేయాలని ఆయన అన్నారు. విద్యార్థులు ఎంతో ఆసక్తితో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. సుమారు 145 మంది రక్త దానం చేశారు. కార్యక్రమంలో కళాశాల పిజి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కల్పనా, బాల చంద్ర నాయుడు బ్లడ్ సెంటర్, డాక్టర్ చెన్నయ్య, ఎన్ఎస్-ఎస్ కో -ఆర్డినేటర్ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రజకుల హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి-రాయచోటి

రజకుల హక్కుల కోసం పోరాటం చేస్తామని జిల్లా రజక సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్బాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జిఒ హోంలో జరిగిన సమావేశానికి సంఘ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టి. రమేష్బాబు మాట్లడుతూ రజకులు ఎన్నో ఏళ్లుగా దుర్భర జీవితాల్ని గడుపుతున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్సి జాబితాలో ఉన్న రజకుల మాదిరిగా ఎపిలో కూడా రజకులను ఎస్సి జాబితాలో చేర్చేలా తీర్మానం చేస్తామని రజకులకు హామీ ఇచ్చారన్నారు. రజకులను ఎస్సి జాబితాలో చేర్చడం వల్ల సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎదుగుతారని అన్నారు. ఉపాధ్యక్షులు ఎం.వి.రమణ మాట్లాడుతూ రజకులందరు ఐకమత్యంగా ఉండి తమ తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యదర్శి వి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక నుంచి జిల్లాలో ప్రతి గ్రామానికి తిరిగి రజకులను చైతన్యవంతులను చేసేవిధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వి. రామాంజులు, సంబేపల్లి మండల అధ్యక్షులు డి.మధు, ఆనంద్, వి.సాంబశివ, వి. మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

ఉచిత మెగా డిఎస్సి కోచింగ్ : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యుటియఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత డిఎస్సి కోచింగ్ ఇవ్వనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ భవన్లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతమే బాధ్యతగా, పాఠశాలల పరిరక్షణ పరమావధిగా, బడుగు, బలహీన వర్గాలకు బాసటగా, నాణ్యమైన విద్యను బోధించుటకు అవసరమైన నవతరం ఉపాధ్యాయులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా డిఎస్సి బోధనలో ఉభయ రాష్ట్రాలలో ఉద్దండులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంచే ఉచిత డిఎస్సి కోచింగ్ సెంటర్ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24న ఉదయం 9:30 గంటలకు ఫ్రీ డెమో తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిఇఒ షంషుద్దీన్ హాజరై తరగతులు చెబుతారని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 23 లోపు కె.నరసింహ రావు 9440384701, గాజులపల్లి గోపీనాథ్ 9885125056 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ కాగలరని తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఏజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, జిల్లా సీనియర్ నాయకులు పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్ ఫలితాలలో మెరిసిన శ్రీవెంకటరెడ్డి సిద్ధార్థ విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జెఇఇ మెయిన్స్ ఫలితాలలో పట్టణంలోని శ్రీవెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి తెలిపారు. ఆదివారం కళాశాల ప్రాంగణంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ జెఇఇ మెయిన్స్ ఫలితాలలో బి.తనుశ్రీ 95.88 శాతం మార్కులు సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలవగా, పి.దేదీప్య సాయి 93.66 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. అదే క్రమంలో పి.మహమ్మద్ సోహిల్ 90.56 శాతం, జి.మిథున్ హరిహరన్ 88.83 శాతం, పి.ఆల్మస్ 82.88శాతం, డి.మోక్షజ్ఞ రెడ్డి 80.30 శాతం మార్కులతో సత్తాచాటారన్నారు. తమ కళాశాల విద్యార్థులు వరుస విజయాలు సాధిస్తూ పట్టణంలో అగ్రస్థా నంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పి.దేదీప్య సాయి ఆల్ ఇండియాలో 3578 ర్యాంక్ సాధించి పట్టణంలో మొదటి స్థానంలోను, బి.తను శ్రీ 8973 ర్యాంకుతో ద్వితీయ స్థానంలో నిలవడం జరిగిందని వివరించారు. ఈ విజయాలకు కారణమైన విద్యార్థులకు అధ్యాపకులకు, తల్లిదండ్రులకు కళాశాల డైరెక్టర్ హేమంత్ కుమార్, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవోపేతంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని డిబిఎస్పల్లెలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ సీతా రామ, లక్ష్మణ, హనుమ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరణ గావించి కృష్ణ స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కల్యాణోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అశేషంగా పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు, నిర్వాహకులు చలువ పందిళ్ళు, కూలర్లు ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం రాములోరి రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు టి.నారాయణ, టటి.హరికృష్ణ, ఎం.బాలనరసయ్య, కే.సుబ్బారా యుడు, ఎస్.నరసింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటోవాలా..ఢీలా!

- ఎన్నికల హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- ఏటా రూ.15 వేలు ఇస్తామని పది నెలలైనా ఇవ్వని వైనం
- అమలు చేసి ఆదుకోవాలంటున్న ఆటో డ్రైవర్లు

స్టాండ్లో ఉన్న ఆటోలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆటో డ్రైవర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతుండటంతో తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.99, పెట్రోల్ రూ.110 వరకూ ఉంది. దీంతో ఆటోలను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కార్మికులు బెంబేలెత్తి పోతున్నారు. నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలంలో 48 ఆటోలు, లింగాల 28, చక్రయపేట 35, తొండూరు 25, వేముల 24, వేంపల్లి 105, పులివెందుల పట్టణ పరిధిలో 180 ఆటోలున్నాయి. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోలపైనే ఆధార పడి గమ్యస్థానాలకు చేరుతున్నారు. ముఖ్యంగా ఆర్టిసి బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులుంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో ఆటో కార్మికుడికి రోజంతా కష్టపడితే రూ.200 నుంచి రూ.300 కూడా మిగలని పరిస్థితి నెలకొంది. ఏటా ఇన్సూరెన్స్, ఫిటెనెస్, సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేల దాకా ఖర్చువుతుంది. వీటితో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణా శాఖాధికారులు దాడులు చేసి రూ.వేల జరినామా విధించడం, ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ కంతులను కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బు ఇంధనం, ఇతర ఖర్చులకే పోతు న్నాయని వాపోతున్నారు.

ఆటో కార్మికులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులకు ఆదుకునే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటోకార్మికులు విమర్శిస్తున్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీ అమలు చేయడం లేదని మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో భరోసా

ఎన్నికల హామీ మేరకు గత ప్రభుత్వంలో రాష్ట్ర బడ్జెట్లో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించి అర్హులైన ఆటో, టాక్సీ, మాక్సీక్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ. 10 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమచేసి ఆదుకున్నారు. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేశారు. అలాగే రవాణా వాహన కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ. 3 లక్షల వరకు వడ్డీరాయితీ అందించారు.

- శీను, ఆటో డ్రైవర్, పులివెందుల

రూ.15 వేలు ఇవ్వాల్సిందే

రోజంతా కష్టపడి ఆటో తోలినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతోపాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పు చేసి ఆటో కొనుగోలు చేసి వాటి ఫైనాన్స్, పెరిగిన బీమా ప్రీమియం. రోడ్డు ట్యాక్స్లు కట్టుకోలేక ఆటోలను నడపలేకపోతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ15 వేలు చొప్పున ఇవ్వాలి.

- శేఖర్, నాలుగు చక్రాల ఆటో డ్రైవర్ , పులివెందుల

కుటుంబ పోషణ భారం

15 ఏళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు అంతగా గిరాకీ ఉండడంలేదు. ఇలాంటి పరిస్థితి నుంచి ఆటోడ్రై వర్లకు ఆర్థికంగా సాయం చేయాలి. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

- పవన్, ఆటో డ్రైవర్, పులివెందుల

వైసిపి, టిడిపి దొందూ దొందే : పిసిసి

ప్రజాశక్తి - కడప

వైసిపి, టిడిపి రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయని, దొందూ దొందే అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఇందిరా భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అర చేతిలో వైకుంఠం చూపిస్తే చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందని అన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మద్య, జూద, డ్రగ్, గంజాయి ఆంధ్ర ప్రదేశ్గా తయారు చేసి వెళ్లి పోయింది. అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లుంది చంద్ర బాబు ప్రభుత్వం పని తీరు అన్నారు. మండలానికి నాలుగు మద్యం షాపులు నలభై బెల్టు షాపులు అన్నట్లు మద్యం పాలసీ తయారైందని వాపోయారు. పాఠశాలల్లో కూడా డ్రగ్స్, గంజాయి ప్రవేశించాయి. బాదుడు కార్యక్రమం భారీగా సాగుతోంది. సర్దుబాటు ఛార్జీల పేరుతో రు 15,485 కోట్ల అదనపు భారం మోపింది. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయి. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వలేదు.యువతను నమ్మించి మోసగించడం జరిగింది అని ఘాటుగా విమర్శించారు.తల్లికి వందనం పథకం తల్లికి మోసం పథకంగా మారిందని వాపోయారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం రావాలన్నా, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ రావాలన్నా ,సంజీవిని లాంటి ప్రత్యేక హోదా రావాలన్నా గ్రాండ్ ఓల్డ్ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నియ మితులైన సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, కార్యదర్శి భువన్ ఏకాదశి రెడ్డిని సన్మానించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, కార్యదర్శి భువన్ ఏకాదశి రెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి సంగటి చిన్న సుబ్బారెడ్డి, ఎస్సి సెల్ రాష్ట్ర కన్వీనర్ శాంతయ్య, ఓబయ్య , శ్యామలమ్మ, నాగరత్న గౌడ్, షేక్ సుల్తాన్ మొహిద్దిన్, షేక్ అమానుల్లా, ఉత్తన్న, అమర్, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఫాదర్ విజయ్‌మోహన్‌రెడ్డి

వైభవంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని క్రైస్తవులందరూ ఆదివారం ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.పండగ సందర్భంగా మండలంలోని అన్ని చర్చిలు విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మానవాళి కోసం సిలువలో ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు చనిపోయిన మూడో రోజు సమాధి నుంచి తిరిగి లేచిన రోజున ఈస్టర్ పండగ జరుపుకుంటారని రెవరెండ్ ఫాదర్ విజయ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి, లూథరన్‌చర్చి, నిష్ప చర్చి, మద్దిరేవుల చర్చిలలో ఈస్టర్ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభువు చూపించిన శాంతి, సహనం, పరస్పర సహకార గుణాలతో అన్ని వర్గాల వారు జీవించాలని ప్రభువు శాంతి సందేశాన్ని అందించారు.ఈస్టర్ పండుగ సందర్భంగా 40 రోజులపాటు ఉపవాసాలు ఉన్న విశ్వాసులు పొదుపు చేసిన ఆహార పదార్థాలు, నగదు, వస్త్రాలను పేదలకు దానం చేశారు.

క్రైస్తవులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్ : పట్టణంలోని సిఎస్ఐ జెసిఎం చర్చిలో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక మిషన్ కాంపౌండ్ లోని జ్ఞానోదయ క్షేత్రం నుంచి ఉదయం 5 గంటలకే పట్టణంలోని క్రైస్తవులు, భక్తులు చేరుకుని గొప్ప ర్యాలీగా, భక్తి గీతాలు ఆలపిస్తూ పట్టణంలోని ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా డేవిడ్ సంజయ్ కొయర్ బృందం భక్తి గీతాలు ఆలపించారు. ఈస్టర్ ప్రత్యేక వేడుకల్లో ఎమ్మెల్యే షాజహా న్‌బాషా క్రైస్త వులకు అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. క్రైస్తవ సమాజంలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి వారి సొంతింటి కలను సహకారం చేస్తామ న్నారు. చర్చి కమిటీ తరపున తమకు దరఖాస్తులను చేరవేస్తే త్వరలోనే ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చర్చి సెక్రెటరీ జెఇ భక్తవత్సలం, ట్రెజరర్ ఆనంద్, కమిటీ సభ్యులు సూరి, జుగ్ను శేఖర్, సుజాతా, దీనా, సర్పంచ్ మధు, అధిక సంఖ్యలో క్రైస్తవులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షను సోమవారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మలంషావలి తెలిపారు.మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసి ఆరవ తరగతిలో చేరే అభ్యర్థులు గతంలో ఆన్‌లైన్ ద్వారా చేరేందుకు దరఖాస్తులు చేసుకు న్నారు. వారికి పరీక్షలు రాసేందుకు హాల్ టికెట్లను పంపడం జరిగింది. హాల్ టికెట్ పొంది నవారు సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12గంటల జరిగే పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలని ఆయన సూచించారు.

నల్లారి చంద్రారెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రమణీయంగా ద్రౌపది కల్యాణం

ప్రజాశక్తి-కలికిరి

రోడ్డు మార్గంలో అంకాలమ్మ గుడి దగ్గర వారం రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఏడవ రోజు ద్రౌపది కల్యాణం నిర్వహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. మండలంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం ద్రౌపది కల్యాణం రమణీయంగా జరిగింది. ద్రౌపదికి ఐదుగురుభర్తలు విధిలిఖితమని, ఆమె పూర్వజ న్మవృత్తాంతం చెప్పి వ్యాసమహర్షి ఆమెను ఐదుగురు పాండవులు వివాహ మాడటమే సరైనదని సమర్థించాడు. శ్రీకృష్ణుడు, భీష్మ, ద్రోణ కృపాదులు అఖిల రాజలోకం హర్షించారు సమర్థించారు. ఆనాటి నుండి ద్రౌపది కళ్యాణం ప్రతిఏటా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అనంతరం ప్రజలకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జడ్‌పిటిసి నల్లారి చంద్రారెడ్డి, వాటర్ రవి, చింతపర్తి సిద్దయ్య, దినకర్, మురళి యాదవ్, నిజముద్దీన్ పాల్గొన్నారు.

మస్తానయ్యకు నివాళులు

ప్రజాశక్తి-నందలూరు : నందలూరు లోని పలు ప్రజా సమస్యలపై పోరాటం సలిపిన ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షులు దివంగత పోతురాజు మస్తానయ్య ఇటీవల అకాల మరణం చెందారు. నందలూరు లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్, మానవత స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సంయుక్తంగా అరవపల్లి లోని ఆర్అండ్‌బి కూడలిలో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులతో పాటు పుర ప్రజలు పాల్గొని మస్తానయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున పేదలకు జరిగిన అల్పాహార వితరణ చేశారు. కార్యక్రమంలో మస్తానయ్య సోదరుడు, కుమారుడు, రమేష్ నాయుడు, ఎస్ఐ మన్నెం రామమోహన్, హిమగిరి నాథ్ యాదవ్, ఆదినారాయణ, అల్లం అశోక్ కుమార్, వెంకటేష్, కుర్రా మణి యాదవ్, ఉప్పు శెట్టి సుధీర్, జంగంశెట్టి సుబ్బయ్య, మోడపోతులు రాము, గంధం గంగాధర్, గురు ప్రసాద్, గుండు సురేష్, సునీల్ రెడ్డి, ఆంజనేయులు, కానకుర్తి వెంకటయ్య, వేణు గోపాల్, రమేష్ రాయల్, ఏనుగుల బాలాంజనేయులు, ఎల్లయ్య, మోహన్ రెడ్డి, పరిటాల ప్రసాద్ పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలోని అన్నగారిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న విశ్వనాథం కుమారుడు ఋషిక్ బ్రెయిన్‌లో బ్లడ్ క్లాక్, అవ్వడం వల్ల బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం పెద్దిరెడ్డి కుటుంబం పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ చేతుల మీదుగా 50,000 ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు చౌడేశ్వర్, ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి, జయ సింహారెడ్డి, సర్పంచ్ కేతిరెడ్డి జ్యోతి వాటర్ షెడ్ చైర్మన్ సుధాకర్ రెడ్డి , శ్రీకంఠ రెడ్డి , మల్లికార్జున్ నాయుడు, రమణారెడ్డి, ఎంపిటిసి రవినాయక్, సర్పంచ్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రమీలమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైసిపి నాయకులు

కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా :ఎమ్మెల్యే

బి.కొత్తకోటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం పట్టణంలో ఆయన పర్యటించి రంగసముద్రం రోడ్డులోని వైసిపి నాయకులు, కార్యకర్తలు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవలసిన అవసరం లేదని, ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలు నెరవేర్చకపోగా తప్పుడు కేసులతో వైసిపి నాయకులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా వైసిపి కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భయపడాల్సిన అవసరం లేదని, వారి తరపున పోరాటం చేస్తానని పేర్కొన్నారు. నాయకులు,కార్యకర్తలే పార్టీకి ప్రధాన బలమని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని, కార్యకర్తలు అధైర్య పడాల్సి అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు సి.ఆర్ చిన్నికృష్ణ, వేములేటికోట సర్పంచ్ రవి, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి, వైసిపి ప్రచార కార దర్శి అయూబ్‌బాషా, విద్యార్థి విభాగం అధ్యక్షుడు అభిలాష్‌రెడ్డి, గుమ్మడి కాయల చాంద్‌భాషా, గుడిపల్లి సర్పంచ్‌రఘు, సోషల్ మీడియా మండల కన్వీనర్ పవన్, వైసిపి నాయకులు సాయి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

వైసిపి నాయకుడు పి.రఫీ అనారోగ్యంతో బెంగళూరులోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రఫీని పలకరించి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించిన రఫీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపిజిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, బసిరెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కిషోర్ రెడ్డి, నియోజకవర్గం వైసిపి ప్రచార కమిటీ అధ్యక్షుడు షేక్ అయూబ్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

రాయచోటి : సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నివాసం వద్ద టిడిపి కార్యకర్తలు, అభిమానులు, నాయకుల మధ్య కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు తినిపించారు. అనంతరం నిమ్మ నపల్లి సర్కిల్, మున్సిపల్ కార్యాలయంలో వేడు కలు నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి చంద్ర బాబు ఫొటో తో చేయించిన భారీ కేక్ నుకట్ చేసి కార్య కర్తలకు తినిపించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, ఆర్జె వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు బాబునాయుడు, నాగార్జున బాబు, ప్రశాంత్, పులి మహాలక్ష్మి, రాధ, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ రాటకొండ సోము, నాదెళ్ల శివ, రామకృష్ణ, నాయుడు పాల్గొన్నారు. **కలకడ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహిం చారు. మండల కేంద్రమైన కలకడ టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు ప్రభా కర్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహిం చుకున్నట్టు తెలిపారు. కార్యక్ర మంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, సర్పంచ్ విశ్వనాథ నాయుడు, మండల యువత అధ్యక్షులు తారకేశ్వర, తిరుపతినాయుడు, ఈశ్వరయ్య, వెంకటరత్నం, కలకడ టౌన్ ఇన్‌ఛార్జిజిలానీబాషా, మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ అలీ, మాజీ ఉపసర్పంచ్ ఓ.వెంకటరమణ, నాయకులు శేఖర్ నాయుడు పాల్గొన్నారు. **మైనార్టీల ఆధ్వర్యంలో..** మండల కేంద్రమైన కలకడ ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్ర మంలో కలికిరి మార్కెటింగ్ యాడ్ కమిటీ డైరెక్టర్ ముబారక్ అలీ, కలకడ టౌన్ ఇన్‌ఛార్జి జిలానీషా, ఇర్ఫాన్‌భాషా, ఖాజా హుస్సేన్, జాఫర్ హుస్సేన్, ఈర్షద్ అలీ పాల్గొన్నారు. **రాయచోటి :** విజనరీ గల నేత నారాచంద్రబాబు నాయుడు పాలన ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలని నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో టిడిపి నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. గ్రామీణ మహిళల ఆర్థిక అభ్యున్నతికి డ్వాక్రా సంఘాల ఏర్పాటు, రైతుబజార్ల ఏర్పాటు, వాట్సప్ గవర్నెన్స్ వంటి అనేక కార్య క్రమాలు చేపట్టారన్నారు. ఆయన స్థాపించిన స్వయం సహాయక సంఘాలు గ్రామీణ పేద మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు డాక్టర్ సుగవాసి విద్యా ధర్, అర్చన విద్యాసంస్థల అధినేత మదన్‌మో హన్‌రెడ్డి, బిసి మహిళా జిల్లా అధ్యక్షులు డివిటి పద్మావతి, గాజులు ఖాదర్‌బాషా, సుజాత, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గుర్రంకొండ :** సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను స్థానిక ఎంపి డిఒ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు నాయిని జగదీశ్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎల్లుట్ల మురళి, నడిమి కండ్రిక, సుధాకర్, మాజీ సింగల్ విండో అధ్య క్షులు మహాత్మరెడ్డి, మాజీ సర్పంచ్ నౌషాద్, కార్య కర్తలు, మల్లయ్యస్వామి, భాస్కర పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలి వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ లర్పించి భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ చంద్రబాబు నిండు నూరేళ్ల ఆయు రారోగ్యాలతో జీవించి మరింత కాలం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు:** నందలూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపం చాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, జిల్లావక్ఫ్ బోర్డ్ మాజీ కార్యదర్శి అమీర్ ఆధ్వ ర్యంలో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అరవపల్లి లోని గ్రామపంచాయతీ కార్యాలయం సర్కిల్లో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి కేక్ కట్ చేసి మిఠా యిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి మోడపోతుల రాము, బీమా మునుస్వామి, ధనుం జయనాయుడు, తుమ్మాది శివకుమార్, సౌమ్య నాథ షామియానా సప్లయర్స్ సుబ్బ నరసయ్య, గంగాధర్, అక్కి వెంకటరమణ ,షేక్ మౌలా, అల్తాఫ్, సయ్యద్ దాదాపీర్, మారే శివకుమార్, బెస్త సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్ పాల్గొన్నారు. **రామాపురం:** సిఎం చంద్రబాబు జన్మదిన వేడు కలను మండల కేంద్రంలోని మూడో కూడలి వద్ద లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అల్లా బకాష్ సన్స్ రైస్ మిల్ వద్ద, సరస్వతిపల్లి గ్రామ సర్పంచ్ మునీర్‌బాషా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్ర మంలో ఎంఎల్ వెంక ట్రాంరెడ్డి, అన్నయ్య, జాఫర్‌వలి, సుబ్బ రామ య్య, ఇమామ్, ఖాసీం పాల్గొన్నారు. **కలికిరి:** సిఎం చంద్ర బాబు నాయుడు జన్మదిన వేడు కలను కలికిరి అమర్నాథ్‌రెడ్డి భవనంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజా ముద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయ కులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకు న్నారు. కార్యక్రమంలో టిడిపి ఉపా ధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, కలికిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి, మాజీ ఎంపిటిసి జనార్దన్ గౌడ్, నాయకపలు అగస్తీశ్వర్, ఎర్రం రెడ్డి, దినకర్, వాటర్ షెడ్ రవి, వైజాగ్ భాషా, శ్రీనివాస్ వర్మ పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌భాషా పాల్గొన్నారు. స్థానిక బస్టాండులో కేకుకట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులను పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** మండలంలోని రాఘవరాజుపురం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో చైర్మన్, నియో జకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్య కర్తలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు ముక్కా సాయివి కాస్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొ న్నారు. **ములకలచెరువు :** రాష్ట్రం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఏకైక సిఎం చంద్రబాబు అని టిడిపి రాష్ట్ర నాయకులు కట్టా దొరస్వామి నాయుడు, మండల టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ద పేర్కొన్నారు. ఆదివారం సీఎం చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా ములకలచెరువు మూడు రోడ్ల కూడలిలో భారీ కేక్ కోసి నాయ కులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకృష్ణ, సాధికారిక అధ్యక్షులు చింతకుంట్ల కేశవులు, రాజంపేట తెలుగు యువత అధికారి ప్రతినిధి శంకర్ నారాయణ, తంబళ్లపల్లె తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కక్కుల సుదర్శన్, అగ్రహారం జహీర్, గ్రామ కమిటీ అధ్యక్షులు తంబళ్ల శివన్న, సుధాకర్ నాయుడు, కొమ్మిరి నాగమల్లప్ప , శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** రాజంపేట పార్లమెంట్ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్ర మంలో పాల్గొన్నవారు మండల తెలుగు యువత అధ్యక్షుడు కొలిమి పకీరయ్య, కొండూరు వెంకటరా మరాజు, ఆంజనేయులు, గోవింద ఎవెంకటేష్, అహ్మద్, భాస్కర్ పాల్గొన్నారు. **పీలేరు:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను పీలేరులో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం పీలేరులో నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, నల్లారి అభిమానులు కేక్ కట్ చేసి చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పరిపాలనాదక్షుడు, నిత్య కృషీ వలుడు, అలుపెరగని పోరాట యోధుడు, అమరావతి రాజధాని సృష్టికర్త నవ్యాంధ్ర నిర్మాత, స్వర్ణాంధ్ర ప్రదాత తెలుగు జాతి గర్వించదగ్గ కోట్లాది తెలుగు ప్రజల గుండెచప్పుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి సంబరాలు చేసు కున్నారు. పేదలకు అన్నదాన కార్యక్రమం చేశా రు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రాజంపేట :పేదలకు అన్నదానం చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య శిబిరానికి హాజరైన ప్రొఫెసర్లు, వైద్యులు

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మండలంలోని మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ పారంపర్య వైద్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరానికి స్థానిక ప్రజలు విశేషంగా లభించింది. ఆరోగ్యంపై అవగాహన పెంచే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ఆయుష్ పారంపర్య వైద్య సంఘం అధ్యక్షుడు ఎన్.మహమ్మద్ ముక్తియార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య శిబిరానికి మండల తహశీల్దార్ కె. ప్రదీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయుర్వేద ద్రవ్యగుణ శాస్త్ర నిపుణులు బులుసు శీతారాం, ఎ.బాబు, రాజేంద్రప్రసాద్, మందుల తయారీ నిపుణులు కె. రామచంద్రారెడ్డి, ఔషధ తనిఖీ విభాగానికి చెందిన డాక్టర్ రాం కుమార్, వైద్యులు సులేమాన్, మహిళల ఆరోగ్య నిపుణులు డాక్టర్ రాఫియాఫిర్దోస్, తస్లీం, రేవతి శిబిరంలో సేవలందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మన ఇంటి పరిసరాల్లో లభించే ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, దినసరి జీవితంలో వినియోగించే సహజ పదార్థాలతో ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో వివరిం చారు. సంఘం అధ్యక్షుడు మొహమ్మద్ ముక్తియార్ మాట్లాడుతూ ప్రస్తుతం వాడుతున్న నూనె, పాలు, చక్కెర, బాయిలర్ చికెన్, ప్యాకెట్ పాలు వంటి ప్రాసెస్డ్ పదార్థాలు ఆరోగ్యానికి హానికరమని, వాటి బదులు సంప్రదాయ ఆహార పద్ధతులు అవలంబించాల్సిన అవసరం ఉందని సూచించారు.వైద్య పరీక్షలు చేయించుకున్న 500 మంది ప్రజలకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమం విజయవంతం కావడంలో కమిటీ సభ్యులు ఉమర్ ఖయ్యూం, షర్ఫుద్దీన్, గౌరవాధ్యక్షులు ఉస్మాన్ గనిఖాన్, మహమ్మద్ ఖదీర్, ఇమాం సాహెబ్, ట్రెజరర్ రౌషన్ జమీర్, జిలాన్, మోహిబ్, నారాయణస్వామి, నబి రసూల్, సుబహాన్ మహమ్మద్ సాదిక్, నయీం సహకారం మరువలేనిదని నిర్వాహకులు తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందిం చడంలో మేల్కొలుపుగా నిలుస్తాయని ప్రజలు అభిప్రాయపడ్డారు.

రక్తదానం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రక్తదానం ప్రాణాదానంతో సమానం

ప్రజాశక్తి-మదనపల్లె

అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా చివరి రోజున సిబ్బంది రక్తదానం చేసి అనంతరం అగ్నిమాపక కేంద్రానికి విచ్చేసిన విద్యార్థులకు అగ్నిమాపక పరికరాలగురించి వివరించినట్లు అగ్నిమాపక అధికారి శివప్ప తెలిపారు. బిఎ సెట్, ఆస్కా లై, హైడ్రాలిక్ టూల్స్, ఇతర అగ్నిమాపక పరికరాల గురించి అవగాహన కల్పించారు. వేసవి సెలవులో విద్యార్థులు చెరువు, బావులు వద్ద ఈతకు వెళ్లినప్పుడు తగు జాగ్రతలు పాటించాలని సూచించారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలకు గురైనా 101/0857222101 కు సమాచారం అందించాలారని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా చివరి రోజున మదనపల్లి అగ్నిమాపక కేంద్రంలో నందు రక్తదాన శిబిరంలో మదనపల్లి అగ్నిమాపక అధికారి, సిబ్బంది, మొలకలచెరువు, వాయల్ప పాడు సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను రాయిస్తున్న వైద్యురాలు

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి : మండలం కేంద్రం కలికిరిలో శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో సంజీవిని ఉమెన్ హెల్త్ కేర్ పేరిట సర్వేకల్ కేన్సర్, అవగాహన, రక్షణ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మేడికుర్తి ఆవరణలో సంజీ విని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తిరుపతిలోని ప్రముఖ మెడిగో ఆస్పత్రికి చెందిన గైనకాలజిస్టులు, తదితర వైద్య నిపుణుల ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. మహిళా గైనకాలజిస్ట పర్యవేక్షణలో పాల్గొన్న మహిళలందరికీ గర్భాశయ కేన్సర్‌పై వివరించారు. 61 మంది మహిళలకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామీణ మహిళల్లోకి ఉపయోగపడేలా ఇంత మంచి ఉచిత గర్భాశ కేన్సర్‌పై అవగాహన, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం పట్ల ప్రజలు అభినందించారు. ఇలాంటి వినూత్నమైన ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్, ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందిస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ డాక్టర్ పివి.బ్రహ్మారెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ శశికుమార్‌రెడ్డి, డాక్టర్ జిలానీ షబ్బీర్ భాషా, కలికిరి టౌన్, రాజువారిపల్లి, సత్యాపురం, చెరువు ముందరపల్లి, మాదిగపల్లి, రెడ్డివారిపల్లి గ్రామాల చుట్టుపక్కలమహిళలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : మండలంలోని గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీవెంకటేశ్వర పశు వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇంటర్న్ షిప్‌లో భాగంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాలేజి పరిసరాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు కళాశాల పశువుల ఫాంలో ఉన్న వ్యవ సాయ క్షేత్రంలో బండలు, రాళ్లు, ఎండిపోయిన చెట్టు కొమ్మలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. అనంతరం విద్యార్థులు ఫార్మా కంపెనీ ప్రతినిధులతో పశు ఔషధాల గురించి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ అధి కారులు డాక్టర్ ఇందిర, డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు డాక్టర్ రేవతి, డాక్టర్ సమీరున్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్‌తో కుటుంబానికి ఆసరా

ప్రజాశక్తి - వేంపల్లె : ఆరోగ్యం కోసం డబ్బులను ఖర్చు చేసుకున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్సీ సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి పేర్కొన్నారు. సిఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను ఆదివారం వేంపల్లెలోని ఆయా బాధితుల ఇంటి వద్దకు వెళ్లి ఉమాదేవి అందజే శారు.వేంపల్లెకు చెందిన రామడుగు పుల్లయ్యకు రూ.63 వేలు, కత్తు లూరుకు చెందిన లక్కిరెడ్డి నాగతులసి రెడ్డికి రూ.30 వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జివి రమణ, డివి సుబ్బారెడ్డి, వేంపల్లె పట్టణ కన్వీనర్ రమేష్, వేమిరెడ్డి, ప్రకాష్, బొజ్జ మైసూరారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు దళితవాడకు చెందిన నరసింహులు (50) ఆటో నిర్వహించుకుంటూ జీవనం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం యధా ప్రకారం ప్రయాణికులతో ముదివేడుకు వెళ్లి అక్కడ వారిని దింపాడు. తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల కోసం వేచి ఉండగా ఎవరూ రాలేదు. దీంతో కాస్త పొద్దుపోయింది. ఇక చేసేదిలేక ఒంటరిగా స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని పరదేశి వారి పల్లె వద్ద ఎదురుగా వచ్చిన బస్సుకు సైడ్ ఇచ్చే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. నరసింహులుకు భార్య చిన్న పాపమ్మ ఉంది. వీరికి పిల్లలు లేకపోవడంతో బంధువులకు చెందిన కార్తీక్ అనే పిల్లవాడిని పెంచుకుంటున్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న నరసింహులు ఆకాల మరణం చెందడంతో వీరి కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం స్పందించి వీరి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు, బంధువులు కోరుతున్నారు.

భార్యాభర్తలను గాయపరచిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

భార్యాభర్తలను గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కంబల్ల రమేష్ కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని దేవులపల్లి పంచాయతీ బొజ్జగుంటపల్లి వడ్డిపల్లికి చెందిన దేరం గుల చంద్రయ్య, లక్ష్మీ దేవి భార్యాభర్తలు. గతంలో దేవళంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా వీరి వడ్డెర కులమునకు చెందిన వాహనము ఊరేగింపు కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రతి వడ్డెర కులస్తులు చందాలు వేసుకుని వాహనమునకు సరిపడా ఖర్చులను ఉపయోగిస్తారు. చంద్రయ్య లక్ష్మీదేవులను అదే గ్రామానికి చెందిన దేరంగుల రమణప్రసాద్ గతంలో జరిగిన జాతర గురించి డబ్బులు అడిగినట్లు తెలిపారు. ఇప్పుడు లేదు తర్వాత ఇస్తామని దంపతులు తెలపడంతో దేరంగుల రమణ ప్రసాద్ డబ్బులు ఇస్తేనే ఊర్లో ఉండండి, లేకుంటే మా ఊరు వదిలిపోండి అని ఆవేశంగా కోపానికి గుర్రై కర్రతో భోంచేస్తున్న భార్యాభర్తలను చితకబాదినట్లు తెలిపారు. గాయాలపాలైన వీరిని బంధువులు మహాల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో లక్ష్మీదేవి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.